ఘనంగా ఆషాఢమాసం బోనాల వేడుకలు

- ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో బోనాల వేడుకలు ప్రారంభం
- పలు పాఠశాలలు, విద్యా సంస్థలతోపాటు ఆలయాల ఆధ్వర్యంలో బోనాల సంబరాలు
- అమ్మవారు, పోతరాజుల వేషధారణలో విద్యార్థులు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఆషాఢ మాసం బోనాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. బోనాలు, పోత రాజుల ఊరేగింపులతో పలు పాఠశాలలు, విద్యా సంస్థలు బోనాల వేడుకలను నిర్వహించాయి. పలు ఆలయాల ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపు జరిగాయి. అదేవిధంగా ఆదివారం, సోమవారం జరిగే బోనాల ఉత్సవాలకు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో అమ్మవారి దేవాలయాలను నిర్వాహకులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వహకులు ప్రముఖులను బోనాల పండుగకు రావాల్సిందిగా ఆహ్వానించారు.

ముషీరాబాద్ / అంబర్‌పేట జోన్‌బృందం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):



అంబర్‌పేట మహాకాళి ఆలయంలో బోనాలకు హాజరు కావాలని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పి. జ్ఞానేశ్వర్‌గౌడ్ తదితరులు



మేదరబస్తీలో జరిగే బోనాలకు హాజరు కావాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, రేశం మల్లేష్ తదితరులు



డాక్టర్ బీ. ఆర్. అంబేద్కర్ కళాశాలలో జరిగిన బోనాల వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో జరిగిన బోనాల వేడుకలో అమ్మవారు, పోతరాజు వేషధారణలో విద్యార్థులు



విద్యుత్ దీపాలతో అలంకరించిన గంగానగర్‌లోని మహాకాళి, బంగారుమైసమ్మ దేవాలయాలు



జెమినికాలనీ పోచమ్మ ఆలయంలో జరిగిన బోనాల వేడుకలో పాల్గొన్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, వంశీ తదితరులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన తెలంగాణ బీసీ ఐక్యవేదిక నాయకులు ఆరే మహేందర్, దశరథం

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు ఆరే మహేందర్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ దశరథం శనివారం కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎం. రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలి



మంత్రి పొన్నంకు వినతిపత్రం సమర్పిస్తున్న సత్యనారాయణ, అంతయ్య

చిక్కడపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధిక మొత్తంలో నిధులు కేటాయించి పాలకవర్గాన్ని నియమించాలని కోరుతూ వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ తెలంగాణ ప్రతినిధులు శనివారం రాష్ట్ర రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జరిపేటి సత్యనారాయణరాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్యలు మాట్లాడుతూ వడ్డెరల స్థితిగతులు మంత్రికి వివరించామని తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని వివరించారు. సీఎం దృష్టికి తెచ్చి కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో తనవంతుగా కృషి చేస్తానని చెప్పినట్లు వారు పేర్కొన్నారు.

అంజన్‌కుమార్‌యాదవ్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శనివారం వివేక్‌నగర్ స్లమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివాదరహితుడు, కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సంక్షేమానికి పాటుపడిన అంజన్‌కుమార్‌యాదవ్‌కు టీపీసీసీ చీఫ్ పదవినివ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయేందర్‌బాబు, సుబ్బారావు, సంతోష్, శ్రీనివాస్, చెన్నయ్య, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బర్కత్‌పుర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలతో పాటు షీటీం సేవలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. శనివారం నారాయణగూడలోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు బాలల హక్కులు, షీ టీమ్, ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, లింగ సమానత్వం, వివక్ష, సఖి సర్వీసెస్, చైల్డ్ లైన్ సేవలు, సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం, పోషకాహారం, హెల్ప్ లైన్ నెంబర్లు (1098, 100, 181, 112, 1930) పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతదేవి, సింధూర, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

చిక్కడపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని అప్రమత్తంగా ఉండాలని అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి టీఎంబీ బుచ్చిబాబు సూచించారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో జూబ్లిహిల్స్ అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆర్థోపెడిక్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో అసోసియేషన్ సభ్యులతోపాటు స్థానికులు వందమందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డా.నీలాంజన్, ఆస్పత్రి మేనేజర్ రాహుల్‌పటేల్, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి 2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న గుజ్జ సత్యం

బర్కత్‌పుర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తక్షణమే సవరించి బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్‌చేశారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని బీసీలసంక్షేమానికి కేవలం 3300 కోట్లు మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకై ఆగస్టు 6న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీ ఆర్ కృష్ణయ్య సారథ్యంలో పార్లమెంటు ముట్టడి నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

బడ్జెట్‌లో దళితులు, గిరిజనులకు అన్యాయం

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన బడ్జెట్‌లో దళితులు, గిరిజనులకు అన్యాయం జరిగిందని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎస్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు చేసిన అన్యాయం అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శంకర్‌తోపాటు డీబీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ శివలింగం పాల్గొని మాట్లాడారు. 20 శాతం ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించలేదన్నారు. ఈ నెల 31న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ కోరారు. జ్యోతినగర్ కమ్యూనిటిహాల్‌లో శనివారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజల ముంగిట తపాల సేవలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ జి రచనశ్రీ మాట్లాడుతూ.. పోస్టాఫీస్ పరిధిలో పలు పథకాలు కేంద్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని వాటిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీని నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్సా ప్రతినిధులు బొట్టు రమేష్, లావణ్య, శ్రావణి, హిమాయత్‌నగర్ హెడ్ పోస్ట్‌మన్ సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రావు

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలి

అంబర్‌పేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి నిరంతరం పోరాటం చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. అంబర్‌పేట డివిజన్ బీజేపీ కార్యకర్తల సమావేశం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి అధ్యక్షతన శుక్రవారం రాత్రి బీజేపీ నగర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ప్రజలకు బీజేపీ కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్, నాయకులు కృష్ణగౌడ్, మైలారం రాజు, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న జస్టిస్ సుధ



మూట్ కోర్ట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే జి. వివేక్, న్యాయ విద్యార్థులు

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోర్టులలో కేసులకు సంబంధించి వాదోపవాదాల తర్వాత కేసుల గెలుపోటములను న్యాయ విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో సమానంగా తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు న్యాయ విద్యార్థులకు నిర్వహించిన మూట్ కోర్ట్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ సుధ మాట్లాడుతూ.. న్యాయకళాశాల యాజమాన్యాలు న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు కళాశాల స్థాయిలో నిర్వహించే మూట్ కోర్ట్ పోటీలు వారికి భవిష్యత్‌లో వృత్తిపరంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల సెక్రటరీ, ఎమ్మెల్యే జి.వివేక్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యనందించాలనే లక్ష్యంతో న్యాయ కళాశాల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ సీనియర్ ప్రొఫెసర్ జి.వి.రెడ్డి, ఓయూ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక యాదవ్, ప్రొఫెసర్ మహేంద్రకుమార్, ప్రొఫెసర్ కె.వి.శర్మ, అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ రిషికాంత్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన పాల్గొన్నారు.

ముషీరాబాద్ తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కొర్ర రాణాప్రతాప్‌సింగ్



కవాడిగూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మండల తహసీల్దార్‌గా కొర్ర రాణాప్రతాప్ సింగ్ శనివారం మండల కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ముషీరాబాద్ తహసీల్దార్‌గా పనిచేసిన గోవర్ధన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణపేట మండలంలో తహసీల్దార్‌గా పనిచేసి సాధారణ బదిలీపై ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి రాణా ప్రతాప్‌సింగ్ వచ్చారు.

రాష్ట్రపతి నిలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు

తిరుమలగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సామాన్య మానవుని జీవితంలో అంతరిక్ష సాంకేతికత పాత్రకు ఎంతో ఆవశ్యకత ఉందని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ అన్నారు. శనివారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆయన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఉపగ్రహాల ద్వారా ప్రదేశాన్ని ట్రాక్ చేయడం గ్లోబల్ నావిగేషన్ సపోర్ట్ సిస్టమ్ శాటిలైట్ సర్వర్ల ద్వారా ఏటీఎంల పనితీరును ఉపగ్రహాలు మనకి అందిస్తున్నాయని చౌహాన్ అన్నారు. వాతావరణ ఉపగ్రహాల ద్వారా వాతావరణ నివేదికలు, వాటి అంచనా రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా తుపాన్‌ల ఉష్ణోగ్రతను తెలియజేస్తున్నాయన్నారు. వైఫల్యాలు సాంకేతిక లోపాల గురించి ఆందోళన చెందకుండా లక్ష్యాలను సాధించడానికి విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్రో భవిష్యత్ ఆవిష్కరణలు ప్రాజెక్టుల గురించి కూడా ఆయన విద్యార్థులకు వివరించారు. మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కే.రజినీప్రియ అబ్దుల్ కలామ్‌ను స్మరించుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో పాఠశాల విద్యార్థుల కోసం ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఎన్‌ఆర్‌ఎస్‌సీ కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జంతర్‌మంతర్ వద్ద దీక్ష కోసం నిరుద్యోగుల భిక్షాటన

- నలుగురు అరెస్ట్

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2, 3 ఉద్యోగాలను పెంచాలని, గ్రూప్ 1కు 1:100 పిలవాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ నేత జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్‌లో భిక్షాటన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు వెళ్లడానికి చార్జీల కోసం భిక్షాటన చేశామన్నారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భిక్షాటన చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అర్జున్, నరసింహ తదితరులున్నారు.

గడ్డం శ్రీనివాస్‌యాదవ్ నియామకం నిబంధనలకు విరుద్ధం

బర్కత్‌పుర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం నిబంధనలకు విరుద్ధమని అఖిల భారత యాదవ మహాసభ నేతలు పేర్కొన్నారు. యాదవ జాతిని తప్పుదోవ పట్టించేందుకే తమిళనాడుకు చెందిన కొంతమంది నేతలు కుట్రలు చేస్తున్నారని వారు ఆరోపించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీంద్రనాథ్‌యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, జాతీయ కార్యదర్శి రమేష్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల రాజేందర్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైకన్ శ్రీనివాస్‌యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, రాష్ట్ర కోశాధికారి దారబోయిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. సమావేశంలో మహాసభ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌యాదవ్, గొర్ల యశ్వంత్‌యాదవ్, విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని ప్రవేశ పెట్టి అమలు చేయాలి

బర్కత్‌పుర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే విద్యాహక్కు చట్టాన్ని ప్రవేశపెట్టి అమలుచేయాలని బహుజన ప్రజా శక్తి తెలంగాణ రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన ప్రజా శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్లా లక్ష్మణ్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, బహుజన ప్రజాశక్తి నేతలు బిఎన్ రమేష్‌కుమార్, రవి, పారంగస్వామి. నర్సింగ్‌రావు అశోక్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

ఆగస్టు 2 నుంచి 18 వరకు గీతన్నల చైతన్యయాత్ర

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బొల్లగాని పుల్లయ్య 36వ వర్ధంతి ఆగస్టు 2 నుంచి సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి ఆగస్టు 18వ తేదీ వరకు తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరులైన యాదిలో గీతన్నల చైతన్యయాత్ర నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, వెంకటేశ్వర్లులు తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సమాజం, అభివృద్ధి, సంక్షేమం కోసం దేవాదాయ శాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 290 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం పట్ల బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ హర్షం వ్యక్తం చే శారు. శనివారం బాగ్‌అంబర్‌పేటలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి బ్రాహ్మణ విద్యార్థుల, సమాజ అభివృద్ధికి విశేష కృషి చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీడీ పోస్టులను మంజూరు చేయాలి

- సీఎంకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం వినతి

హైదరాబాద్ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 1,670 ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(పీడీ) పోస్టులను మంజూరు చేయాలని వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ ఆవరణలో అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కె.వెంకటనారాయణ రామారావు, రవి, బాబురావు, అశోక్, పద్మజ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్‌లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నవారికి అందజేత

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నవారి ఫోన్‌లను ట్రేస్ చేసి చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య వారికి అప్పగించారు 6 నెలల కిందట వాసు, 2 నెలల కిందట మహేష్, 3 నెలల కిందట ప్రసాద్ తమ ఫోన్‌లను పోగొట్టుకున్నారు. వాటిని రికవరీ చేసి బాధితులను శనివారం పీఎస్‌కు పిలిపించి అప్పగించారు.

అంబర్‌పేటలో ఇద్దరు అదృశ్యం



పెంకి శివ



షహనాజ్ ఖాతూన్

అంబర్‌పేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట పీఎస్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాలలో నివాసం ఉండే ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. వీరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉన్నారు. ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట జమ్‌జమ్ మసీదు వద్ద నివాసం ఉండే నౌషాద్ భార్య షహనాజ్ ఖాతూన్ మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. ఆమె మూడు నెలలుగా అదే ప్రాంతంలో ఉండే తన తల్లిగారి ఇంటిలో ఉంటుంది. ఈ క్రమంలో గత నెల 27వ తేదీ సాయంత్రం 4గంటల సమయంలో షహనాజ్ ఖాతూన్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికిరాలేదు. ఆమె కోసం ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 27వ తేదీన ఆమె సోదరుడు మహ్మద్ ఫాయాజ్ అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని నారాయణ కాలేజీ హస్టల్‌లో అస్సాం రాష్ట్రానికి చెందిన పెంకి శివ వంటమనిషిగా పనిచేస్తున్నాడు. ఆయనతోపాటు ఆయన భార్య రీతూ కూడా హస్టల్‌లో ఉంటుంది. భార్యాభర్తల మధ్య కొద్ది రోజులుగా చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 3వ తేదీన శివ తన ఫోన్ స్విచాఫ్ చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య రీతూ ఈ నెల 27వ తేదీన అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గోపాల్‌ను పరామర్శిస్తున్న దత్తాత్రేయ

బీజేపీ నేతను పరామర్శించిన హరియాణా గవర్నర్

చిక్కడపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సీనియర్ బీజేపీ నేత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.గోపాల్‌ను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన గోపాల్‌ను శనివారం చిక్కడపల్లిలోని ఆయన నివాసానికి దత్తాత్రేయ వెళ్లి ఆరోగ్యవివరాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ టి. శైలజాగోపాల్, బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్న సాయిచంద్, సత్తిరెడ్డి, సత్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత

కవాడిగూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం వరం లాంటిందని, దీనిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 212 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ముషీరాబాద్ తహసీల్దార్ కొర్ర రాణాప్రతాప్‌సింగ్‌తో కలిసి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఆర్ఐలు కృష్ణ, సుభాష్, రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపునకు వేస్టేజ్ కవర్‌ల అందజేత

చిక్కడపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): బోనాల జాతర సందర్భంగా దేవాలయాలలో వ్యర్థాల తొలగింపు కోసం వేస్టేజ్ కవర్‌లను గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ శనివారం పంపిణీ చేశారు. ఆది, సోమవారాల్లో జరగనున్న బోనాల పండుగ జాతర సందర్భంగా డివిజన్‌లోని అమ్మవారి దేవాలయాలను కార్పొరేటర్ సందర్శించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ బీజేపీ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

కనకాల కట్టమైసమ్మ ఆలయం వద్ద అమలుకు నోచుకోని శాశ్వత షెడ్ల నిర్మాణం

కవాడిగూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన లోయర్ ట్యాంక్ బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద శాశ్వత షెడ్ల నిర్మాణం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి షెడ్లను నిర్మించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

అలరించిన పద్యనాటక దృశ్య ప్రదర్శనలు

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శివాని ఆర్ట్స్ ఆధ్వర్యంలో బోనాల వేడుకల సందర్భంలో త్యాగరాయగాన సభలో శనివారం రాత్రి పౌరాణిక పద్యనాటక దృశ్యాలు, నాట్యాలతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. శ్రీకృష్ణరాయబారం పద్యపౌరాణిక నాటకంలో మొదటి దృశ్యంలో కృష్ణునిగా ఎం. సర్వేశ్వరరావు, రెండవ దృశ్యంలో ఆంజనేయశర్మ ఒకరిని మించి ఒకరు నటించారు. ఇతర పాత్రల్లో సాంబశివారెడ్డి, బాలనాగేశ్వరరావు, మల్లాది రమణ, అర్జున్‌రావు, బాలనటుడు శ్రీరామ్, ప్రియాంకలు నటించారు. అనంతరం జరిగిన సభలో నిర్వాహకుడు పరమేశ్వర్ పర్యవేక్షణలో కళారత్నం అవార్డులు బహూకరించారు. జంగయ్యగౌడ్, హరిప్రసాద్, దేవనాధసూరి, దైవజ్ఞశర్మ, శిల్పారెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

అంబర్‌పేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఓ ఆర్టీసీ కండక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ అశోక్ తెలిపిన వివరాలప్రకారం.. ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీబస్సు (113ఎం) శనివారం సాయంత్రం మెహిదీపట్నం నుంచి ఉప్పల్ వెళ్తుంది. అంబర్‌పేట ఇరానీ హోటల్ సమీపంలో రోడ్డుపై రఘునాథ్‌నగర్‌కు చెందిన గణేష్, ఎరుకల బస్తీకి చెందిన రవి, అంబర్‌పేటకు చెందిన తులసి అనే ముగ్గురు వ్యక్తులు నిల్చుండడంతో డ్రైవర్ హారన్ కొట్టాడు. కండక్టర్ మహేందర్ వారిని పక్కకు జరగమని చెప్పడంతో ఆగ్రహం చెందిన వారు కండక్టర్ మహేందర్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. మహేందర్ ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితులలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తులసి అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు.